సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

బుధవారం । 18 । అక్టోబర్ । 2023

I



చీనీ టన్ను రూ.22 వేలు
అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో మంగళవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.22 వేలు పలికాయి. మార్కెట్‌కు 19 టన్నుల చీనీకాయలు అమ్మకానికి వచ్చాయి.



టమాట కిలో రూ.10
అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో మంగళవారం కిలో టమాట గరిష్ట ధర రూ.10 పలికింది. కనిష్టం రూ.6, సరాసరి రూ.8 ప్రకారం క్రయ విక్రయాలు సాగాయి.

గరిష్టం/కనిష్టం
38.2°/ 22.3°
జిల్లాలో మంగళవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. గాలివేగం తగ్గింది. ఉక్కపోత కొనసాగింది. గంటకు 4 నుంచి 6 కిలో మీటర్ల వేగంతో ఆగ్నేయం దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

నృసింహా నమో నమః



నృసింహావతారంలో ఖాద్రీశుడు

కదిరి టౌన్: దేవీ శరన్నవ రాత్రి వేడుకలు జిల్లాలో వైభవంగా జరుతున్నాయి. ఉత్సవాల్లో మూడో రోజైన మంగళవారం రాత్రి కదిరి ఖాద్రీశుడు భక్తులకు నృసింహుని అవతారంలో దర్శనమిచ్చారు. సర్వలంకార భూషితుడైన ఖాద్రీశుడి దర్శనానికి భక్తులు భారీగా తరలిరాగా ఆలయం కిటకిటలాడింది. పాలక మండలి చైర్మన్ గోపాలకృష్ణ, ఈఓ వి.శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

ర్యాష్ డ్రైవింగ్‌పై కఠిన చర్యలు తీసుకోండి

- ఎస్పీకి చిన్నారి ఆద్య కుటుంబీకుల వినతి



ఎస్పీకి వినతిపత్రం అందిస్తున్న ఆద్య తల్లిదండ్రులు, వైఎస్సార్ సీపీ నేత వేణురెడ్డి

హిందూపురం: నిర్లక్ష్యంగా వాహనాలు నడిపి ప్రమాదాలకు కారణమవుతున్న వారిపట్ల కఠిన చర్యలు తీసుకోవాలని చిన్నారి కట్టా ఆద్య తల్లిదండ్రులు, హిందూపురం వైఎస్సార్ సీపీ నేత వేణురెడ్డి మంగళవారం ఎస్పీ మాధవ రెడ్డిని కోరారు. ఈ మేరకు వినతిపత్రం అందించారు. తమలా మరెవరూ కడుపుకోతకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని ఆద్య కుటుంబీకులు ఎస్పీని కోరారు. ర్యాష్ డ్రైవింగ్ చేస్తూ, భయానక శబ్దాలు చేస్తూ రోడ్డుపై ప్రజలకు భయభ్రాంతులు సృష్టించే వారిపట్ల కఠినంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

రేపు 'జగనన్న చేదోడు'

- నాలుగో విడత సొమ్ము ఖాతాల్లో జమ
- జిల్లాలో 11,194 మందికి లబ్ధి

నియోజకవర్గం	లబ్ధిదారుల సంఖ్య	మొత్తం (రూ.లక్షల్లో)
పుట్టపర్తి	2,053	205.30
ధర్మవరం	2,025	202.50
హిందూపురం	1,494	149.40
కదిరి	1,847	184.70
మడకశిర	1,220	122.00
పెనుకొండ	1,823	182.30
రాప్తాడు	732	73.20
మొత్తం	11,194	1119.40

పుట్టపర్తి అర్బన్: చేతి వృత్తులపై ఆధారపడి జీవనం సాగిస్తున్న రజకులు, నాయీబ్రాహ్మణులు, టైలర్లకు ఏటా రూ.10 వేలు అందించే 'జగనన్న చేదోడు' పథకం నిధులు ఈనెల 19న లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేయనున్నట్లు కలెక్టర్ అరుణ్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం 10.30 గంటలకు కలెక్టరేట్‌లోని స్పందన సమావేశ మందిరంలో లబ్ధిదారులకు మెగా చెక్కు అందజేయనున్నట్లు వెల్లడించారు. 2023–24 సంవత్సరానికి సంబంధించి జిల్లాలో 11,194 మంది అర్హులను గుర్తించగా, వారి ఖాతాల్లో రూ.10 వేల చొప్పున రూ.11.194 కోట్లు జమ చేయనున్నట్లు వెల్లడించారు.

లక్ష్మీకుమారికి పీడీగా పదోన్నతి



పీడీ లక్ష్మీకుమారిని సత్కరిస్తున్న సీడీపీఓలు

పుట్టపర్తి అర్బన్: ఐసీడీఎస్ ఇన్‌చార్జ్ పీడీగా వ్యవహరిస్తున్న లక్ష్మీకుమారికి ప్రభుత్వం పదోన్నతి కల్పించింది. ఆమెను ప్రాజెక్టు డైరెక్టర్ (పీడీ)గా నియమిస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లా ఏర్పాటు నాటి నుంచి లక్ష్మీకుమారి ఐసీడీఎస్ ఇన్‌చార్జ్ పీడీగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. జిల్లాలోని వివిధ ప్రాజెక్టుల్లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా శాఖను విజయ పథంలో నడిపారు. దీంతో ప్రభుత్వం ఆమెకే పూర్తిస్థాయిలో బాధ్యతలు అప్పగించింది. పదోన్నతి దక్కిన సందర్భంగా లక్ష్మీకుమారిని సీడీపీఓలు శాంతలక్ష్మి, గాయత్రి, రమణమ్మ, నాగమల్లేశ్వరి, రాధిక, అనురాధ, సరస్వతి, లక్ష్మి, వరలక్ష్మి, గంగరత్న ఘనంగా సత్కరించారు.

ప్రగతి బాటలు



రహదారులు అభివృద్ధికి చిహ్నాలంటారు. అందుకే రహదారుల నిర్మాణంపై వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. నూతన జిల్లా శ్రీసత్యసాయికి ఇటు విజయవాడ అటు మెట్రో సిటీ బెంగళూరు నుంచి రాకపోకలకు ఇబ్బందులు లేకుండా జాతీయ రహదారులు నిర్మిస్తోంది. ముచ్చటగా మూడు జాతీయ రహదారులు జిల్లాలో నిర్మాణం అవుతుండగా ప్రగతికి బాటలు పడుతున్నాయి.

జిల్లాలో జాతీయ రహదారులు ఇలా...

1. తలుపుల మండలం బి.కొత్తపల్లి నుంచి గోరంట్ల మీదుగా హిందూపురం వరకూ నిర్మించే ఎన్‌హెచ్ 716–జీ
2. ముదిగుబ్బ నుంచి పుట్టపర్తి మీదుగా కోడూరు వద్ద ఉన్న ఎన్‌హెచ్ 44 వరకూ నిర్మించే ఎన్‌హెచ్ 342
3. బెంగళూరు నుంచి విజయవాడ వరకూ నిర్మించే గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే

జిల్లాలో మూడు జాతీయ రహదారులు

- 245 కిలోమీటర్ల మేర నిర్మాణం
- భూ సర్వే పూర్తి చేసిన అధికారులు
- రూ.4,243 కోట్లు ఖర్చు చేస్తున్న ప్రభుత్వం

పుట్టపర్తి అర్బన్: జిల్లా అభివృద్ధికి కీలకంగా మారనున్న జాతీయ రహదారుల నిర్మాణాలు శరవేగంగా సాగుతున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో జిల్లాలో 245.58 కిలోమీటర్ల మేర జాతీయ రహదారుల నిర్మాణం చేపట్టారు. ఇందుకోసం ఏకంగా రూ.4243.7 కోట్లు ఖర్చు చేస్తున్నారు.

2,392 ఎకరాల భూసేకరణ

జిల్లాలో నిర్మాణమవుతున్న మూడు జాతీయ రహదారుల కోసం అధికారులు ఇప్పటికే 2392.50 ఎకరాలను సేకరించారు. అంతా ప్రైవేటు భూమి కావడంతో భూములు కోల్పోతున్న రైతుల ఆధార్ నంబర్లు, బ్యాంకు ఖాతా నంబర్లు సేకరిస్తున్నారు. వివరాలన్నీ ఇచ్చిన వారికి వెంటనే పరిహారం కూడా జమ చేస్తున్నారు.

రెండు ప్యాకేజీలుగా 716–జీ రహదారి

జిల్లాలో నిర్మాణమవుతున్న ఎన్‌హెచ్ 716–జీ పనులను రెండు ప్యాకేజీలుగా విభజించారు. ఈ జాతీయ రహదారి వైఎస్సార్ జిల్లా ముద్దనూరు నుంచి హిందూపురం వరకూ ఏర్పాటు కానుంది. జిల్లాలో తలుపుల మండలం కొత్తపల్లి నుంచి కదిరి, గోరంట్ల మీదుగా హిందూపురం వరకూ ఉంటుంది. మొదటి ప్యాకేజీ కింద 57 కిలోమీటర్లు మేర రోడ్డు నిర్మాణాన్ని రూ.840 కోట్లతో ఏర్పాటు చేస్తున్నారు. రెండో ప్యాకేజీ కింద 33.58 కిలోమీటర్లు మేర రోడ్డు నిర్మాణం కోసం రూ.808.7 కోట్లు ఖర్చు చేయనున్నారు. ఈ జాతీయ రహదారికి అవసరమైన 207 హెక్టార్ల భూమిని ఇప్పటికే రెవెన్యూ అధికారులు సేకరించారు. ఇందులో ప్రభుత్వ భూమితో పాటు ప్రైవేటు భూమి ఉంది. మధ్యలో వచ్చే కొండలను చదును చేస్తున్నారు. వంకలు, నదులపై నిర్మించే బ్రిడ్జిలను పటిష్టంగా నిర్మించేందుకు మట్టి నమూనాలు సేకరించి పరిశీలిస్తున్నారు.



గోరంట్ల వద్ద 716-జీ రహదారిపై ఏర్పాటు చేయనున్న బ్రిడ్జి కోసం మట్టి నమూనాలు తీస్తున్న దృశ్యం

శరవేగంగా ఎన్‌హెచ్ 342 పనులు

జిల్లాలో ఎన్‌హెచ్ 342 నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. రెండు ప్యాకేజీల్లో 80 కిలో మీటర్ల మేర నిర్మిస్తున్న ఈ జాతీయ రహదారి కోసం రూ.850 కోట్లు ఖర్చు చేస్తున్నారు. ముదిగుబ్బ నుంచి ఎన్‌హెచ్-44ను కలుపుతూ కోడూరు వరకూ ఈ రోడ్డును నిర్మించ తలపెట్టారు. జిల్లాలో ముదిగుబ్బ నుంచి ప్రారంభమయ్యే ఎన్‌హెచ్ 342 పుట్టపర్తి వరకూ దాదాపు 34 కిలోమీటర్ల మేర డబుల్ లైన్ పూర్తి కావచ్చింది. ఇందుకు సుమారు రూ.310 కోట్లు ఖర్చు చేస్తున్నారు. ఇక రెండో ప్యాకేజీ కింద పుట్టపర్తి నుంచి కోడూరు వరకూ 46 కిలోమీటర్ల మేర నాలుగు లైన్ల రోడ్డు నిర్మించనున్నారు. ఇందుకోసం రూ.540 కోట్లు ఖర్చు చేయనున్నారు. ఈ రోడ్డు కోసం ఇప్పటికే 436 ఎకరాల భూమిని సేకరించారు. ఖాతాలు సమర్పించిన రైతులకు రూ.65 కోట్ల పరిహారం కూడా జమ చేశారు. రోడ్డు వెంబడి అక్కడక్కడా ఏర్పాటు చేయనున్న జంక్షన్లకు మరో 60 ఎకరాల భూమి సేకరించాల్సి ఉందని డీఈ జగదీష్ గుప్తా తెలిపారు. రెండో దశ పనుల్లో భాగంగా పుట్టపర్తి నుంచి కోడూరు వరకూ జంగిల్ క్లియరెన్స్, రోడ్డుకు ఇరువైపులా హద్దులు ఏర్పాటు చేస్తున్నారు.



పుట్టపర్తి వద్ద జాతీయ రహదారి 342 కోసం భూమిని చదును చేసిన దృశ్యం

జాతీయ రహదారి	సేకరించిన భూమి	జిల్లాలో రోడ్డు దూరం	ఖర్చు (రూ.కోట్లలో)
716–జీ	207 హెక్టార్లు	90.58 కి.మీ	1,648.70
342	174.4 హెక్టార్లు	80 కి.మీ	1745
గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్	575 హెక్టార్లు	75 కి.మీ	850
మొత్తం	956.4 హెక్టార్లు	245.58	4,243.70

ఆరు వరసల్లో గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ వే

బెంగళూరు– విజయవాడ మధ్య నిర్మిస్తున్న గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ వే ఆరు వరుసల్లో వేయనున్నారు. జిల్లాలో చిలమత్తూరు మండలం కోడూరు నుంచి గోరంట్ల, ఓడీచెరువు, పుట్టపర్తి, నల్లమాడ, ముదిగుబ్బ మండలాల మీదుగా సుమారు 75 కిలో మీటర్లు మేర ఈ రహదారి సాగుతుంది. దీని పనులు మూడు ప్యాకేజీల్లో చేపట్టనున్నారు. భూసేకరణ, రోడ్డు నిర్మాణ పనులకు ఏకంగా రూ.1,745 కోట్లు ఖర్చు చేయనున్నారు. ఇప్పటికే 575 హెక్టార్ల భూమిని సేకరించిన అధికారులు జిల్లాలో నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. ఇందులో అటవీ భూమికి గాను రెండింతల ప్రభుత్వ భూమిని అటవీశాఖకు కేటాయించారు. ఇందులో మొక్కల పెంపకం చేపట్టి సంరక్షించనున్నారు.

కలెక్టర్, జాయింట్ కలెక్టర్‌కు అభినందన

జాతీయ రహదారుల నిర్మాణంలో భాగంగా ఇప్పటి వరకూ ఎలాంటి సమస్య ఉత్పన్నం కాకుండా భూ సేకరణ పూర్తి చేసిన కలెక్టర్ అరుణ్‌బాబు, జాయింట్ కలెక్టర్ చేతన్‌ను ఉన్నతాధికారులు అభినందించారు. ఈ మేరకు సోమవారం విజయవాడ రీజనల్ ఆఫీసర్ ఆర్‌కే సింగ్ నుంచి అభినందన లేఖ కూడా అధికారులకు అందింది. ప్రాజెక్టు కోసం సలహాలు, సూచనలు ఇవ్వాలని అందులో పేర్కొనడం విశేషం. దీంతో అధికారులు, సిబ్బంది సంతోషం వ్యక్తం చేశారు.

సంతోషంగా భూమి ఇచ్చా



342 జాతీయ రహదారి కోసం నా భూమి 2 ఎకరాలు సేకరించారు. జాతీయ రహదారి వస్తే పుట్టపర్తితో పాటు గ్రామీణ ప్రాంతాలు సైతం అభివృద్ధి చెందుతాయి. పట్టణాలకు త్వరగా చేరుకోవడానికి, పరిశ్రమలు నెలకొల్పడానికి అనువుగా ఉంటుంది. తద్వారా యువతకు ఉపాధి అవకాశాలూ మెరుగవుతాయి. అందువల్లే ప్రభుత్వం అడగ్గానే నా భూమి సంతోషంగా ఇచ్చా. ప్రస్తుతం రోడ్డు నిర్మాణ పనులు శరవేగంగా చేస్తున్నారు.
– రుషికేశవరెడ్డి, బీడుపల్లి

ఉపాధి అవకాశాలు మెరుగు



జిల్లాలో జాతీయ రహదారుల నిర్మాణం పూర్తయితే పుట్టపర్తి కేంద్రంగా మరిన్ని పరిశ్రమలు ఏర్పాటయ్యే అవకాశం ఉంది. దీంతో యువతకు స్థానికంగా ఉపాధి అవకాశాలు ఉంటాయి. జాతీయ రహదారి కోసం నా భూమిని సేకరించిన అధికారులు పరిహారం కూడా జమ చేశారు. మా గ్రామం పక్కనే జాతీయ రహదారి వెళ్తోంది. తద్వారా మా గ్రామమూ అభివృద్ధి చెందుతుందని భావిస్తున్నాం.
– రవీంద్రనాయక్, గోనేనాయక్ తండా

రైతుల సహకారం బాగుంది



జిల్లా పరిధిలో మూడు జాతీయ రహదారుల నిర్మాణం కోసం భూ సేకరణ పూర్తి చేశాం. ఇందుకు కొందరు ప్రైవేటు భూములు కూడా సేకరించాం. రైతులు కూడా బాగా సహకరించారు. జాతీయ రహదారులు వస్తే పట్టణాలకు కనెక్టివిటీ పెరుగుతుంది. జిల్లా అభివృద్ధిలో జాతీయ రహదారులు కీలక పాత్ర పోషించనున్నాయి.
– అరుణ్‌బాబు, కలెక్టర్

కీచక ఉపాధ్యాయుడిపై వేటు

ప్రశాంతి నిలయం/తనకల్లు: ఉపాధ్యాయ వృత్తికే తలవంపులు తీసుకువచ్చేలా ప్రవర్తించి తన వద్ద చదువుకునే విద్యార్థిని గర్భం దాల్చేందుకు కారకుడైన ఉపాధ్యాయుడు రెడ్డి నాగయ్యను విద్యాశాఖ అధికారులు సస్పెండ్ చేశారు. ఈ మేరకు డీఈఓ మీనాక్షి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. వివరాల్లోకి వెళితే... తనకల్లు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గత విద్యాసంవత్సరం పదో తరగతి పూర్తి చేసిన ఓ బాలిక ప్రస్తుతం ఇంటర్ చదువుతోంది. ఇదే పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా పనిచేసే రెడ్డి నాగయ్య బాలికపై గతంలో లైంగిక దాడి చేశాడు. దీంతో గర్భందాల్చిన బాలిక రెండు రోజుల క్రితం కడుపునొప్పితో బాధపడుతూ ఆస్పత్రిలో చేరగా, పురిటి నొప్పులను నిర్ధారించిన వైద్యులు ఆమెకు ప్రసవం చేశారు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు తనకల్లు పోలీస్ స్టేషన్‌లో రెడ్డి నాగయ్యపై ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు సోమవారం రెడ్డి నాగయ్యను అరెస్ట్ చేసి పోక్సో చట్టం కింద అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ నేపథ్యంలో విద్యాశాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు డీఈఓ మీనాక్షి రెడ్డి నాగయ్యను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

మరో ఉపాధ్యాయురాలిపై వేటు

'నాడు–నేడు' పనులలో అక్రమాలకు పాల్పడిన తనకల్లు మండలం నల్లగుట్టపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇన్‌చార్జ్ హెడ్‌మాస్టర్ నివేదితను సస్పెండ్ చేస్తూ డీఈఓ మీనాక్షి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. రెండో విడత 'నాడు–నేడు' పనుల్లో నివేదిత నిబంధనలను తుంగలో తొక్కుతూ ఏకంగా రూ.5 లక్షలు స్వాహా చేశారని ఉన్నతాధికారులకు ఫిర్యాదు అందగా, జిల్లా విద్యాశాఖ అధికారులు విచారణ చేపట్టారు. 'నాడు–నేడు' పనులకు సంబంధించి పాఠశాల కమిటీ తీర్మాణం లేకుండానే ఇన్‌చార్జ్ హెడ్ మాస్టర్ నివేదిక రూ.5 లక్షలు కాజేసినట్లు గుర్తించారు. పనులు చేయకుండానే డబ్బు డ్రా చేసినట్లు గుర్తించి ఆమెను సస్పెండ్ చేశారు.

మహిళా కూలీపై చర్నాకోలుతో దాడి

యాడికి: కూలి డబ్బులు ఇవ్వండని తోటి కూలీల సమక్షంలో అడిగిన మహిళా కూలీపై భూ యజమాని చర్నాకోలుతో దాడిచేశాడు. ఏఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. చందన గ్రామానికి చెందిన మహిళా రైతుకూలీ గుండే సావిత్రి మరో ఐదుగురితో కలిసి గత ఏడాది కావలి రామాంజనేయులు అనే భూ యజమానికి చెందిన పత్తి పంటలో కలుపుతీశారు. అయితే ఇంతవరకూ కూలి చెల్లించలేదు. మంగళవారం ఉదయం సదరు కూలీలు పనులకు వెళ్తున్న సమయంలో రామాంజనేయులు తారసపడ్డాడు. దసరా పండుగ వస్తోందని తమకి వ్వాల్సిన కూలి డబ్బులు ఇవ్వండి అంటూ సావిత్రి అడిగింది. అంతమందిలో డబ్బు అడిగేసరికి అవమానంగా భావించిన రామాంజనేయులు ఆగ్రహంతో ఊగిపోయాడు. విచక్షణ మరచి చర్నాకోలు తీసుకుని సావిత్రిపై విరుచుకుపడ్డాడు. అడ్డొచ్చిన తోటి మహిళా కూలీలను పక్కకు తోసేసి మరీ సావిత్రిని వీపుపై ఇష్టానుసారం కొట్టడంతో ఆ భాగంలో వాతలు పడ్డాయి. అనంతరం సావిత్రి యాడికి పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేసింది. పోలీసుల నుంచి స్పందన లేకపోవడంతో రాత్రి 7 గంటల సమయంలో గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీలందరూ సావిత్రికి మద్దతుగా స్టేషన్‌కు వెళ్లి భూ యజమాని రామాంజనేయులుపై కేసు నమోదు చేయాలని వాగ్వాదానికి దిగారు. దీంతో రామాంజనేయులుపై ఏఎస్ఐ వెంకటేశ్వర్లు కేసు నమోదు చేశారు.





బాధితురాలి వీపుపై తేలిన వాతలు (ఇన్‌సెట్‌లో) బాధితురాలు సావిత్రి

అకడమిక్ కన్సల్టెంట్ పోస్టుల భర్తీకి నేడు ఇంటర్వ్యూలు

అనంతపురం: ఎస్కేయూలోని ఇంగ్లిష్, మేథమేటిక్స్, బోటనీ విభాగాల్లో అకడమిక్ కన్సల్టెంట్ పోస్టుల భర్తీకి బుధవారం ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ కృష్ణకుమారి ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఇంటర్వ్యూలకు నేరుగా హాజరు కావచ్చన్నారు. అభ్యర్థులు సంబంధిత విభాగాల్లో పీహెచ్‌డీ గానీ నెట్ (నేషనల్ ఎలిజిబులిటీ టెస్ట్), సెట్ (స్టేట్ ఎలిజిబులిటీ టెస్ట్)లో అర్హత పొంది ఉండాలన్నారు. రెజ్యూమ్‌తో పాటు సర్టిఫికెట్లు ఒక సెట్ జిరాక్స్ కాపీలను తీసుకురావాలన్నారు. బోటనీ విభాగం వారికి మధ్యాహ్నం 2 నుంచి 3 గంటల వరకు, ఇంగ్లిష్ విభాగంలో మధ్యాహ్నం 3 నుంచి 4 గంటల వరకు, మేథమేటిక్స్ విభాగంలో 4 నుంచి 5 గంటల వరకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని పేర్కొన్నారు.

సికింద్రాబాద్-తిరుపతి మధ్య ప్రత్యేక రైళ్లు

గుంతకల్లు: ఈ నెల 19, 20 తేదీల్లో సికింద్రాబాద్–తిరుపతి మధ్య ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైళ్లు నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌ఓ రాకేష్ ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం రాత్రి 8 గంటలకు సికింద్రాబాద్‌లో బయలుదేరి శుక్రవారం ఉదయం 9 గంటలకు తిరుపతి చేరుకుంటుంది. తిరిగి ఈ రైలు (07042) శుక్రవారం సాయంత్రం 7.55 గంటలకు తిరుపతి జంక్షన్‌లో బయలుదేరి శనివారం ఉదయం 9.30 గంటలకు సికింద్రాబాద్ చేరుతుంది. ఈ రైలు కాచిగూడ, షాద్‌నగర్, గుంతకల్లు, తాడిపత్రి, యర్రగుంట్ల, కడప, రేణిగుంట మీదుగా రాకపోకలు సాగిస్తుంది.

పేదల ఆరోగ్యానికి భరోసా



ఈ వృద్ధురాలి పేరు లక్ష్మీదేవమ్మ. ముదిగుబ్బ మండలం బూదనంపల్లి గ్రామం. గతంలోనే ఎడమ కన్ను చూపు కోల్పోయింది. రెండేళ్లుగా చెవులు సైతం వినపడవు. ఈఎన్‌టీ వద్ద చూపించుకునేందుకు ఆర్థిక స్థోమత లేకపోవడంతో ఇబ్బందులు పడుతూ వచ్చింది. ఇటీవల బూదనంపల్లిలో 'జగనన్న ఆరోగ్య సురక్ష' వైద్య శిబిరం నిర్వహించగా, అక్కడికి వెళ్లి ఈఎన్‌టీ వైద్యుడితో పరీక్ష చేయించుకుంది. లోపం గుర్తించిన వైద్యుడు మెరుగైన వైద్యం కోసం అనంతపురంలోని సర్వజనాస్పత్రి ఈఎన్‌టీ సర్జన్ వద్దకు రెఫర్ చేశారు. అక్కడికి వెళ్లిన లక్ష్మీదేవమ్మ ఆరోగ్య శ్రీ ద్వారా ఉచితంగా శస్త్రచికిత్స చేయించుకుంది. వైద్యులు వినికిడి యంత్రాన్ని కూడా ఇస్తామని చెప్పడంతో ఆమె ఆనందం వ్యక్తం చేస్తోంది. ...ఇలా ఎందరో నిరుపేదల ఆరోగ్యానికి 'జగనన్న ఆరోగ్య సురక్ష' భరోసా ఇస్తోంది.



జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో వైద్య సేవలు అందిస్తున్న వైద్యులు

- జిల్లాలో జోరుగా 'జగనన్న ఆరోగ్య సురక్ష' శిబిరాలు
- ఇప్పటికే 265 వైద్య శిబిరాల నిర్వహణ

ప్రశాంతి నిలయం: పేదలకు స్థానికం మెరుగైన వైద్య సేవలు అందించేందుకు సీఎం వైఎస్ జగన్ ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 'జగనన్న ఆరోగ్య సురక్ష' సత్ఫలితాలిస్తోంది. స్పెషలిస్ట్ వైద్యులు పల్లెల్లోకే వచ్చి వైద్య సేవలు అందిస్తుండగా, సురక్ష శిబిరాలకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోంది. రోజూ వైద్య శిబిరాల ద్వారా 10 నుంచి 15 వేల మంది ఓపీ సేవలు పొందుతున్నారు.

265 శిబిరాలు.. 97 వేల మందికి వైద్యం

జిల్లాలో 416 వైద్య శిబిరాలు నిర్వహించాలని అధికారులు నిర్ణయించారు. సెప్టెంబర్ 30వ తేదీ నుంచి ఇప్పటి వరకు గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో కలిపి ఇప్పటి వరకు 265 వైద్య శిబిరాలు నిర్వహించారు. మొత్తంగా 97,850 మంది ఓపీ సేవలు పొందారు. మరో 2,824 మందికి మెరుగైన వైద్యం కోసం అధికారులు రెఫర్ చేశారు. ఇక పట్టణ ప్రాంతాల్లో 12 వైద్య శిబిరాలు నిర్వహించగా 5,790 వేల మందికి ఓపీ సేవలు అందించారు, 57 మందిని మెరుగైన వైద్య సేవల కోసం రెఫర్ చేశారు. ప్రతి వైద్య శిబిరంలో ఇద్దరు స్పెషలిస్ట్‌లు, మరో ఇద్దరు ఎంబీబీఎస్ వైద్యులు సేవలు అందిస్తున్నారు.

నేడు 16 ప్రాంతాల్లో 'సురక్ష' శిబిరాలు

జిల్లాలోని 16 ప్రాంతాల్లో బుధవారం 'జగనన్న ఆరోగ్య సురక్ష' వైద్య శిబిరాలు నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. కనగానపల్లి మండలం ముత్తవకుంట, ధర్మవరం మండలం రావుల చెరువు, తాడిమర్రి మండలం చిన్నచిగుల్లరేవు, ముదిగుబ్బ మండలం మంగలమడక, చెన్నేకొత్తపల్లి మండలం గంగినేపల్లి, రొద్దం మండలం కంబాలపల్లి, మడకశిర మండలం చంద్రకచర్ల, అమరాపురం మండలం హేమావతి, గుడిబండ మండలం మోరుబాగల్, అగళి మండలం మధూడి, పరిగి మండలం ఎర్రగుంట, ఓడీచెరువు మండలం వెంకటాపురం, గోరంట్ల మండలం నారశింపల్లి, చితమత్తూరు మండలం కొడికొండ, హిందూపురంలోని లక్ష్మీపురం, అర్బన్ హెల్త్ సెంటర్, కదిరిలోని కుటాగుళ్ల–1 అర్బన్ హెల్త్ సెంటర్లలో సురక్ష శిబిరాలు నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు.

క్లుప్తంగా

'ఐసీఐసీఐ'లో ఉద్యోగాలు.. రేపు వాక్ఇన్ ఇంటర్వ్యూలు

అనంతపురం అగ్రికల్చర్: ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ లైఫ్ ఇన్సూరెన్స్‌లో యూనిట్ మేనేజర్లు, ఫైనాన్షియల్ అడ్వయిజర్ ఉద్యోగాల నియామకానికి ఈ నెల 19న వాక్ఇన్ ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు. ఈ మేరకు జిల్లా ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ ఎ.కళ్యాణి మంగళవారం ఓ ప్రకటన జారీ చేశారు. ఎంప్లాయిమెంట్ కార్యాలయం వేదికగా గురువారం జరిగే ఇంటర్వ్యూలకు ఆసక్తి ఉన్న అభ్యర్థులు నేరుగా హాజరు కావచ్చు. డిగ్రీ విద్యార్హత, 18 నుంచి 33 సంవత్సరాల్లోపు ఉన్న వారు యువతీ యువకులు అర్హులు. సంబంధిత ధ్రువీకరణ పత్రాలతో ఈ నెల 29న ఉదయం 10.30 గంటలకు ప్రారంభమయ్యే ఇంటర్వ్యూలకు హాజరు కావాలి.

అంబులెన్స్ డ్రైవర్ పోస్టుల భర్తీకి చర్యలు

అనంతపురం అగ్రికల్చర్: ఉమ్మడి జిల్లా పరిధిలోని డాక్టర్ వైఎస్సార్ పశువైద్య 1962 మొబైల్ వెటర్నరీ అంబులెన్స్‌లలో ఖాళీగా ఉన్న డ్రైవర్ పోస్టుల భర్తీకి చర్యలు తీసుకున్నారు. ఈ మేరకు ఆ విభాగం జిల్లా మేనేజర్ రామకృష్ణగౌడ్, రాయలసీమ ప్రోగ్రాం మేనేజర్ వరప్రసాద్ మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. పదో తరగతి విద్యార్హతతో పాటు హెవీ డ్రైవింగ్ లైసెన్స్ కలిగిన వారు అర్హులు. పూర్తి వివరాలకు 96525 33554, 88860 88787లో సంప్రదించవచ్చు.

డ్రాగన్‌ఫ్రూట్.. 'ఉపాధి'కి రూట్!

- డ్రాగన్‌ఫ్రూట్ సాగుకు ఉపాధి నిధులు
- మూడేళ్లలో రూ.1.85 లక్షలు అందించనున్న ప్రభుత్వం
- పెరగనున్న పంట సాగు విస్తీర్ణం



పుట్టపర్తి అర్బన్: మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా డ్రాగన్ ఫ్రూట్ రైతులకూ లబ్ధి చేకూరనుంది. ఇప్పటి వరకూ దీర్ఘకాలిక పండ్ల తోటలు సాగు చేసే రైతులకు ప్రభుత్వం ద్వారా ప్రోత్సాహకాలు అందుతున్నాయి. తాజాగా ఆ జాబితాలో డ్రాగన్ ఫ్రూట్ పంట కూడా చేరింది. 5 ఎకరాల లోపు భూమి ఉన్న రైతులు డ్రాగన్ ఫ్రూట్ పంట సాగు చేస్తే మూడేళ్ల పాటు నిర్వహణ ఖర్చులు అందజేస్తారు. స్థానిక ఉపాధి సిబ్బందితో ఎస్టిమేట్లు వేయించి ప్రభుత్వానికి వివరాలు పంపితే సబ్సిడీ కింద డబ్బు మంజూరవుతుంది. ప్రస్తుతం జిల్లాలో 90 ఎకరాలకు పైగా డ్రాగన్ ఫ్రూట్ పంట సాగులో ఉంది. ప్రభుత్వం తాజాగా ప్రోత్సాహకం అందజేయాలని నిర్ణయించడంతో పంట సాగు విస్తీర్ణం పెరగనుంది.

ఉద్యాన పంటల బాటలో రైతులు..

జిల్లా రైతులు ఇటీవల డ్రాగన్ ఫ్రూట్ పంట సాగుపై మక్కువ చూపుతున్నారు. తక్కువ ఖర్చుతో మంచి దిగుబడులు సాధించి ఆదాయం పొందుతున్నారు. ఇక.. డ్రైల్యాండ్ హార్టికల్చర్ కింద ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందిస్తుండడంతో చాలా మంది పండ్ల తోటలు సాగుకు ఉపక్రమిస్తున్నారు. కొంత మంది సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు సైతం వ్యవసాయం బాట పట్టి వివిధ రకాల ఉద్యాన పంటలను సాగు చేస్తున్న విషయం తెలిసిందే.

14 రకాల పంటలకు..

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా 14 రకాల పంటలకు ప్రోత్సాహకాలు అందుతున్నాయి. మామిడి, జీడి మామిడి, చీనీ, నిమ్మ, జామ, తైవాన్ జామ, సపోటా, కొబ్బరి, సీతాఫలం, దానిమ్మ, నేరేడు, చింత, రేగు, గులాబీ పూల తోటలు, మల్లె పూల తోటలు తదితర పంటలకు సబ్సిడీలు కల్పిస్తున్నారు. మూడేళ్ల పాటు పంట నిర్వహణ ఖర్చులు అందజేస్తున్నారు. వీటిల్లో ఇప్పటివరకూ తైవాన్ జామకు అత్యధికంగా నిర్వహణ ఖర్చులు అందుతుండగా, తాజాగా ఆ కోవలో డ్రాగన్ ఫ్రూట్ చేరడం గమనార్హం. సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

అర్హతలు ఇలా..

- రేషన్ కార్డు కలిగి ఉండాలి.
- 5 ఎకరాల కంటే తక్కువ భూమి ఉండాలి.
- బోరు బావి ఉండాలి.
- అర ఎకరా పైన డ్రాగన్ ఫ్రూట్ సాగు చేయాల్సి ఉంటుంది.
- ఎకరాలో 225 పిల్లర్లకు 900 మొక్కలు నాటాలి.
- అరమీటరు లోతు, అర మీటర్ చుట్టు కొలత ఉండేలా మొక్కలకు గుంతలు తీయాలి.
- రైతులకు మొదటి సంవత్సరం రూ.1,54,026 అందజేస్తారు. రెండో ఏడాది రూ.14,100, మూడో సంవత్సరం రూ.16,407 అందుతుంది.
- 205 పని దినాల మేర ఖాతాలో నగదు జమవుతుంది.

సద్వినియోగం చేసుకోవాలి



డ్రాగన్ ఫ్రూట పంట సాగు చేస్తే ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందజేస్తుంది. 5 ఎకరాల లోపు భూమి ఉన్న రైతులకు ఎకరాకు రూ.1.85 లక్షలు మూడేళ్ల పాటు అందుతుంది. రైతులు సద్వినియోగం చేసుకోవాలి. స్థానిక ఉపాధి సిబ్బందికి వివరాలను అందజేసి పంట సాగు చేయాలి.

– రామాంజనేయులు, డ్వామా పీడీ

విష జ్వరంతో బాలుడి మృతి



మృతుడు కృషికుమార్

అమరాపురం/మడకశిర: మండల పరిధిలోని హనుమంతనపల్లి గ్రామానికి చెందిన పాతన్న కుమారుడు కృషికుమార్ (4) విష జ్వరంతో మంగళవారం మృతి చెందాడు. బాలుడి తండ్రి తెలిపిన మేరకు.. కృషికుమార్ వారం రోజులుగా జ్వరంతో బాధపడుతున్నాడు. రెండు రోజుల క్రితం అమరాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లగా, డాక్టర్ పరీక్షించి మెరుగైన వైద్యం కోసం మడకశిర ఆస్పత్రికి రెఫర్ చేశారు. మంగళవారం మడకశిర ప్రభుత్వాసుపత్రికి వెళ్లగా, వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. బాలుడి మృతితో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. ఉప్పార్లపల్లి వైఎస్సార్‌సీపీ నాయకుడు శివన్న మృతదేహానికి నివాళులర్పించి దహన సంస్కారాలకు కొంత నగదు అందజేశారు.

ప్రచారం అవాస్తవం

కాగా, బాలుడి మృతదేహాన్ని మడకశిర ఆస్పత్రి నుంచి స్వగ్రామానికి తీసుకెళ్లేందుకు ఆస్పత్రి అధికారులు అంబులెన్స్ ఏర్పాటు చేయలేదంటూ సోషల్ మీడియాలో కొందరు ప్రచారం చేయడం వివాదాస్పదమైంది. స్థానిక తహసీల్దార్ ముర్షావలి దీనిపై ఆస్పత్రి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శశిరేఖ, ఆర్ఎంఓ దివాకర్ సమక్షంలో మృతుడి కుటుంబ సభ్యులను విచారించారు. ఆస్పత్రి అధికారులకు తెలియకుండానే కుటుంబ సభ్యులు మృతదేహాన్ని ద్విచక్రవాహనంలో తీసుకెళ్లినట్లు తేలింది. తమకు తెలియజేసి ఉంటే అంబులెన్స్ ఏర్పాటు చేసేవారమని డాక్టర్లు పేర్కొన్నారు. ఈ మేరకు కలెక్టర్‌కు నివేదిక పంపినట్లు తహసీల్దార్ తెలిపారు.

ఇంట్లో చోరీ



కొత్తచెరువు: మీర్జాపురం గ్రామంలోని ఓ ఇంట్లో చోరీ జరిగింది. ఎస్ఐ సురేష్ బాబు తెలిపిన మేరకు.. గ్రామానికి చెందిన రిటైర్డ్ కండక్టర్ రామాంజనేయులు కొత్తగా మరో ఇల్లు నిర్మిస్తున్నాడు. సోమవారం రాత్రి కుటుంబసభ్యులందరూ ఆ ఇంటి వద్ద పడుకున్నారు. మంగళవారం ఉదయం తాము నివసిస్తున్న ఇంటి వద్దకు వస్తే తాళాలు తెరిచి ఉన్నాయి. బీరువాలో ఉన్న 7 తులాల బంగారు, రూ.50 వేల నగదు కనిపించలేదు. దీంతో బాధితుడు కొత్తచెరువు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

జగన్ పాలనకు జనం జేజేలు



వైఎస్సార్ సీపీలో చేరిన టీడీపీ నాయకుడు లోనికోట అమర్, తదితరులతో ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

ధర్మవరం: సంక్షేమం, అభివృద్ధి సమపాళ్లుగా పాలన సాగిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి జనం జేజేలు పలుకుతున్నారని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక యాదవ వీధిలో టీడీపీ నాయకుడు లోనికోట అమర్‌తో పాటు ముక్తం నాగభూషణ, వెంకటరమణ, అశ్విని, లావణ్య, లక్ష్మి, కుమార్, బాలాజీ, నవీన్‌వెంకటేశ్, శివ, జయరామ్ తదితర 50 కుటుంబాలు ఎమ్మెల్యే కేతిరెడ్డి సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. ఎమ్మెల్యే వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ప్రభంజనం సృష్టించడం ఖాయమన్నారు. పేదల సంక్షేమమే లక్ష్యంగా జగనన్న ప్రభుత్వం పని చేస్తోందన్నారు. నాలుగున్నరేళ్లలో రాష్ట్ర వ్యాప్తంగా 86 శాతం మందికి సంక్షేమ పథకాల ద్వారా రూ. 2.5 లక్షల కోట్లకు పైగా అందజేశామన్నారు. ఒక్క ధర్మవరం నియోజకవర్గంలోనే రూ. 2,283 కోట్ల నగదు లబ్ధిదారుల ఖాతాల్లో జమైందన్నారు. బైపాస్, ఫోర్‌వే, మౌలిక వసతుల కల్పన, అర్బన్‌హెల్త్ సెంటర్ల ఏర్పాటు, నాడు నేడు పథకం ద్వారా విద్యా సంస్థల అభివృద్ధికి దాదాపు రూ. 6 వేల కోట్లు ఖర్చు చేశామన్నారు. పార్టీలకతీతంగా అర్హులందరికీ పథకాలు దరిచేర్చామన్నారు. కొంత మంది కుహనా మేధావులు పథకాలకే డబ్బంతా ఖర్చు చేస్తున్నారని విమర్శిస్తున్నారని, అలాంటి వారికి అభివృద్ధి పనులతోనే సమాధానం చెబుతున్నామని స్పష్టం చేశారు. గతంలో ఏనాడైనా ఇంత పెద్ద ఎత్తున సంక్షేమం, అభివృద్ధి చేసిన దాఖలాలు ఉన్నాయా అని ప్రశ్నించారు. మంచి జరిగితేనే ఓటెయ్యండని ధైర్యంగా కోరుతున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లాంటి ముఖ్యమంత్రి దేశంలో ఎక్కడా ఉండరన్నారు. దోచుకోవడం, దాచుకోవడం తప్ప టీడీపీ నేత చంద్రబాబు ఒరగబెట్టిందేమీ లేదని,అందుకే ప్రజాక్షేత్రంలో ఆ పార్టీకి కాలం చెల్లిందని విమర్శించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ వేముల జయరామిరెడ్డి, పార్టీ పట్టణాధ్యక్షుడు నీలూరిప్రకాష్, సచివాలయాల కన్వీనర్లు మాసపల్లి సాయికుమార్, చందమూరి నారాయణరెడ్డి, కౌన్సిలర్లు, సీనియర్ నాయకులు చాంద్‌బాషా, సానే నర్సింహారెడ్డి,ఉడుముల రామచంద్ర, పెణుజూరు నాగరాజు, గజ్జల శివ, అజంతా క్రిష్ణ, తీర్థాల వెంకటరమణ, కత్తె పెద్దన్న, ఎస్పీబాషా, కృష్ణాపురం జమీర్ అహ్మద్, అత్తార్‌జిలాన్‌బాషా, సుబాన్, బీరే జయచంద్ర, పరంధామిరెడ్డి, సాధిక్ తదితరులు పాల్గొన్నారు.

సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ ఆత్మహత్య



బసవరాజు(ఫైల్)

రొళ్ల: పురుగుల మందు తాగి సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ ఆత్మహత్య చేసుకున్న ఘటన రొళ్ల మండలం హెచ్‌ఎం పల్లి గ్రామంలో చోటుచేసుకుంది. స్థానిక ఎస్ఐ మధురామ చంద్రుడు తెలిపిన మేరకు.. గ్రామానికి చెందిన రంగమ్మ, చిక్కన్న దంపతులకు ఆరుగురు కుమార్తెలు, ఒక కుమారుడు బసవరాజు(32) సంతానం. కుమార్తెలందరికీ పెళ్లిళ్లయ్యాయి. బీటెక్ చదివిన బసవరాజు బెంగళూరులోని ఓ ప్రైవేట్ కంపెనీలో పని చేస్తున్నాడు. 5 రోజుల క్రితం స్వగ్రామానికి వచ్చాడు. తనకు పెళ్లి చేయాలని తల్లిదండ్రులను కోరాడు. ఈ క్రమంలోనే ఈ నెల 14న సాయంత్రం ఇంట్లో ఎవరు లేని సమయంలో పురుగుల మందు తాగాడు. అపస్మారక స్థితిలో పడి ఉన్న బసవరాజును కుటుంబ సభ్యులు వెంటనే 108 ద్వారా మడకశిర ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం బెంగళూరులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. చికిత్స ఫలించక మంగళవారం తెల్లవారుజామున బసవరాజు మృతి చెందాడు. ఒక్కగానొక్క కుమారుడి మృతితో కుటుంబ సభ్యులు, బంధువులు గుండెలవిసేలా విలపించారు. తండ్రి చిక్కన్న ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

పిచ్చికుక్క స్వైరవిహారం

మడకశిర: పట్టణంలోని మల్లినాయకనపల్లి తండాలో (2వవార్డు) పిచ్చికుక్క స్వైరవిహారం చేసింది. సోమవారం రాత్రి 10 గంటల ప్రాంతంలో ఐదుగురిని గాయపరిచింది. గాయపడిన నాగరత్నమ్మ, అర్జున్‌నాయక్, యశ్వంత్‌నాయక్, గోవిందనాయక్, సురేష్‌నాయక్‌ను స్థానికులు మడకశిర ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్స చేయించారు. 2వ వార్డు పరిధిలో పిచ్చికుక్కల సంచారం ఎక్కువగా ఉందని, వెంటనే మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరారు.

అంతర్జాతీయ జంప్ రోప్ పోటీలకు ఎంపిక



విద్యార్థి సుదీప్

నల్లమాడ: మండల కేంద్రంలోని పాత బాలాజీ ఇంగ్లిష్ మీడియం ఉన్నత పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న ఏ.సుదీప్ అంతర్జాతీయ జంప్ రోప్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల కరస్పాండెంట్ పోలే వెంకటరెడ్డి, పీఈటీ హనీఫ్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 14 నుంచి 17 వరకూ తెనాలిలో జరిగిన 20వ సబ్ జూనియర్ జంప్ పోటీల్లో పాల్గొని అత్యుత్తమ ప్రతిభ కనబరచడంతో డిసెంబర్‌లో బ్యాంకాక్‌లో జరిగే అంతర్జాతీయ జంప్ రోప్ పోటీలకు సుదీప్ ఎంపికైనట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్‌తో పాటు ప్రిన్సిపాల్ పోలే స్వర్ణలత, ఉపాధ్యాయులు అభినందించారు.

ప్రశాంతంగా ముగిసిన నైపుణ్య పరీక్ష



అభ్యర్థిని ఇంటర్వ్యూ చేస్తున్న నైపుణ్య పరీక్ష బోర్డు సభ్యులు

అనంతపురం ఎడ్యుకేషన్: ఉమ్మడి అనంతపురం జిల్లాలోని భవిత కేంద్రాల్లో ఖాళీగా ఉన్న సహిత విద్య (ఇన్‌క్లూజివ్ ఎడ్యుకేషన్) రిసోర్స్ పర్సన్ (ఆర్పీ)ల ఎంపిక కోసం మంగళవారం నిర్వహించిన నైపుణ్య పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. సమగ్రశిక్ష కార్యాలయంలో ఏపీసీ నాగరాజు ఆధ్వర్యంలో అభ్యర్థుల నైపుణ్యాన్ని పరీక్ష బోర్డు సభ్యులు పరిశీలించారు. ఎంఆర్ విభాగంలో ఖాళీగా ఉన్న 15 పోస్టులకు గాను 1:3 నిష్పత్తి మేరకు 40 మంది అభ్యర్థులను ఇంటర్వ్యూలకు ఆహ్వానించారు. వీరిలో 38 మంది హాజరయ్యారు. అలాగే వీఐ/హెచ్ఐ విభాగంలో 27 పోస్టులకు గాను 58 మంది అర్హత సాధించగా, 57 మంది హాజరయ్యారు. నైపుణ్య పరీక్ష కోసం ఏర్పాటు చేసిన బోర్డులో సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ నాగరాజు, స్టేట్ సీనియర్ అడ్వయిజర్ ఫర్ ఇన్‌క్లూజివ్ ఎడ్యుకేషన్ వింగ్ రామ్ కమల్, వికలాంగుల సంక్షేమశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ అబ్దుల్ రసూల్, సమగ్ర శిక్ష అనంతపురం జిల్లా ఐఈ కోఆర్డినేటర్ షమ, శ్రీసత్య సాయి జిల్లా కోఆర్డినేటర్ ఆనంద్ ఉన్నారు.

కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి



ఐక్యత చాటుతున్న ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు

పుట్టపర్తి టౌన్: కార్మికుల సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాటాలు చేస్తామని ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు నాగార్జున రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం పుట్టపర్తి పట్టణంలోని కోటాసత్యం గార్డెన్స్‌లో యూనియన్ సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేశారు. ఎన్ఎంయూ డ్రైవర్ల అసోసియేషన్ నుంచి 16 మంది కార్మికులు ఎంప్లాయిస్ యూనియన్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏపీఎస్ ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసి కార్మికులు జీవితాల్లో వెలుగులు నింపారన్నారు. కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో జోనల్ నాయకులు శేఖర్, బాబన్న, రీజనల్ సెక్రటరీ జీవైసీ రావ్, ట్రెజరల్ రమణప్ప, డిపో అధ్యక్షులు చెన్నప్ప, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

కట్టుకున్నోడే కడతేర్చేందుకు యత్నించాడు!

- పోలీసులకు మహిళ ఫిర్యాదు

కదిరి: భర్త తనను చంపాలని ప్రయత్నించాడని ఓ వివాహిత మంగళవారం కదిరి పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. వివరాలు.. కదిరి మండలం వీరేపల్లి పేటకు చెందిన దుద్దుకుంట రామ్మోహన్‌రెడ్డి మొదటి భార్య చనిపోవడంతో తనకల్లు మండలం పరాకువాండ్లపల్లికి చెందిన ఇందిరమ్మను ఐదేళ్ల క్రితం రెండో వివాహం చేసుకున్నాడు. కదిరి పట్టణంలోని వైఎస్సార్ నగర్‌లో కాపురం ఉంటున్నారు. ఈ నెల 10న ఇందిరమ్మ స్నానపుగదిలోకి వెళ్తే భర్త కూడా వెంటే వెళ్లాడు. వాటర్ హీటర్ పట్టుకుని చనిపోయిందనే నెపం వేసే ప్రయత్నంలో టవల్‌తో ఆమెను చంపాలని చూశాడు. ఇందిరమ్మ కేకలు వేసేందుకు యత్నిస్తుంటే మరోసారి టవల్‌తో గొంతు బిగించాడు. మళ్లీ ఆమె విడిపించుకొని కేకలు వేసింది. చుట్టుపక్కల వారు వచ్చే లోపు ముందుగానే సిద్ధం చేసుకున్న పురుగులమందు తాగి కింద పడిపోయినట్లు రామ్మోహన్‌రెడ్డి నటించాడు. అక్కడికొచ్చిన వారి సాయంతో భర్తను ఆమె స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించింది. మెరుగైన వైద్యం కోసం వైద్యులు అనంతపురం ఆస్పత్రికి రెఫర్ చేశారు. అక్కడి వైద్యులు ఆయనకు ప్రాణాపాయం లేదని తెలిపారు. ఈ క్రమంలోనే రామ్మోహన్ రెడ్డి బంధువుల ఇంటికి వెళ్లి ఇప్పటికీ అక్కడే ఉంటున్నాడు. తన పేరు మీద రూ.10 లక్షల లైఫ్ ఇన్సూరెన్స్ ఉన్నందున వాటర్ హీటర్ షాక్ కొట్టి చనిపోయిందనే ముద్ర వేసి ఆ డబ్బు సొంతం చేసుకోవాలనే కుట్ర పన్నాడని, తన భర్తపై చర్యలు తీసుకోవాలని ఇందిరమ్మ మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గొర్రెల లోడుతో వెళ్తున్న బొలెరో బోల్తా

- నలుగురికి తీవ్రగాయాలు



ఘటనాస్థలంలో బాధితులు

గాండ్లపెంట: గొర్రెల లోడుతో వెళ్తున్న బొలెరో బోల్తా పడి నలుగురికి తీవ్రగాయాలైన ఘటన మండల పరిధిలోని కమతంపల్లి గ్రామ సమీపంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు.. మండలంలోని సామాలగొందికి చెందిన లక్ష్మీనారాయణ, కల్లుబావి తండాకు చెందిన బద్దేనాయక్, సామచేనుబైలుకు చెందిన తిరుపాలు, ఎన్పీకుంట మండలం మేకల చెరువుకు చెందిన ఆంజనేయులుతో మరో ఇద్దరు మంగళవారం కదిరి వ్యవసాయ మార్కెట్‌కు వెళ్లారు. గొర్రెలు కొనుగోలు చేసి బొలెరోలో గాండ్లపెంటకు బయలుదేరారు. మార్గమధ్యలో కమతంపల్లి వద్ద వాహనం అదుపు తప్పి బోల్తా పడింది. ఘటనలో నలుగురికీ తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు 108లో కదిరి ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్సలందించారు. ఆంజనేయులుకు తీవ్ర గాయాలు కావడంతో బెంగళూరు తరలించారు. ఘటనా స్థలాన్ని ఎస్ఐ వెంకటనారాయణ, హెచ్‌సీ శ్రీనివాసులు పరిశీలించారు.

ప్రతిభ

మన చుట్టూ మనకు తెలియకుండానే
ఎంతో మంది రకరకాల బాధలకు లోనవుతుంటారు.
వారిలో ముఖ్యంగా వృద్ధులు, వికలాంగుల
సమస్యలకు సరైన పరిష్కారం తెలియక
ఇబ్బందులు పడుతుంటారు.
వారి మానాన వారిని అలాగే వదిలేయడం కన్నా
పరిష్కారాన్ని కనుగొంటాను అనుకున్నాడు.
తనదైన మార్గంలో ప్రయత్నించాడు.
విజయం సాధించాడు.
సత్కారాలను పొందుతున్నాడు
హైదరాబాద్ వాసి హేమేష్ చదలవాడ.


తల్లి సంధ్యతో హేమేష్ చదలవాడ

అమ్మమ్మలకు అండగా!

దేశవ్యాప్తంగా వివిధ రంగాలలో సేవలు అందించిన 21 ఏళ్ల లోపు 20 మంది యువ సాధకులను ఢిల్లీలో మొన్న జరిగిన 'అన్‌స్టాపబుల్ 21' వేదికగా సత్కరించారు. హ్యూమన్ స్టడీస్, సైన్స్, క్రీడలు, ఫైన్ ఆర్ట్స్, పెర్ఫార్మింగ్ ఆర్ట్, సోషల్ ఇంపాక్ట్, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ అనే ఏడు రంగాలలో ప్రతిభావంతులైన యువతకు ఈ సత్కారాన్ని అందజేశారు. వారిలో హైదరాబాద్‌కు చెందిన 16 ఏళ్ల హేమేష్ చదలవాడ ఎలక్ట్రానిక్స్ రంగంలో కనబరిచిన ప్రతిభకు గుర్తింపు పొందాడు.


హేమేష్ తయారుచేసిన డివైజ్

మా అమ్మమ్మ వయసున్న వారు ఎదుర్కొంటున్న ఎన్నో సమస్యలకు ఇది సరైన పరిష్కారం సూచిస్తుంది. ఎంతో మందికి సాయం చేస్తుందని ప్రామిస్ చేస్తున్నాను.
– హేమేష్

వృద్ధులకు సహాయం..

హేమేష్ పన్నెండేళ్ల వయసు నుంచి ఎలక్ట్రానిక్స్, రోబోటిక్స్ రంగంలో గణనీయమైన ప్రతిభను చూపుతున్నాడు. అల్జిమర్స్ వ్యాధితో బాధ పడుతున్న అమ్మమ్మను చూసి ఆమెకు ఏదైనా సాయం చేయాలనుకున్నాడు. తన ఆలోచనల గురించి హేమేష్ చెబుతూ 'నడిచేటప్పుడు అమ్మమ్మ అడుగులు తడబడుతుండేవి. మతిమరపు ఉండేది. ఆమెకు తన మీద తనకు కంట్రోల్ ఉండేది కాదు. కొన్నిసార్లు అర్ధరాత్రి మంచంపై నుంచి లేచి ఎటో వెళ్లిపోయేది. దీంతో ఆమెను కనిపెట్టి ఉండటం కష్టమయ్యేది. అమ్మమ్మకు, ఆమెను చూసుకునే మాకూ ఇదో సవాల్‌గా ఉండేది. కొన్ని అందుబాటులో ఉన్న డివైజ్‌లను ప్రయత్నించి చూశాం. కానీ, ఏ మాత్రం సంతృప్తిగా అనిపించలేదు. అమ్మమ్మకు సాయపడే డివైజ్‌ను నేనే సొంతంగా తయారుచేయాలనుకున్నాను' అని తనలో రూపుదిద్దుకున్న ఆలోచనను వివరిస్తాడు. హేమేష్ కృషి, పట్టుదల, అంకితభావానికి అతని తల్లిదండ్రులు కిశోర్, సంధ్యలు ప్రోత్సాహం అందించారు.

పరికరం ఎలా పనిచేస్తుందంటే..

ఈ పరికరం వాచ్‌లాగా మణికట్టుకూ కట్టుకోవచ్చు. బ్యాడ్జ్‌గానూ ధరించవచ్చు. రోగి నడక, భంగిమ, శరీర ఉష్ణోగ్రత, నాడిని పర్యవేక్షిస్తుంది. నీళ్ల జారిపడుతుండే శబ్దాన్ని కూడా గుర్తించగలదు. మనిషి దూరంగా తిరుగుతున్నప్పుడు లేదా పడిపోవడం వంటి ప్రమాదంలో ఉన్నప్పుడు వెంటనే తెలియజేస్తుంది. ఇంకా అలారంలో 'పిల్‌బాక్స్' ఫీచర్ కూడా ఉంటుంది. ఇది రోగులు వారి మందులు తీసుకునే సమయం వచ్చినప్పుడు హెచ్చరికలను పంపుతుంది. 'ఈ డివైజ్ మా అమ్మమ్మ కోసం తయారుచేసినప్పుడు ఇంటర్నెట్ సరైన మార్గం చూపింది. అయితే, ఈ పరికరం పూర్తయ్యేసరికి అమ్మమ్మ చనిపోయారు' అని బాధపడే హేమేష్ డివైజ్ చేతిలో పట్టుకొని 'మా అమ్మమ్మ వయసున్న వారు ఎదుర్కొంటున్న ఎన్నో సమస్యలకు ఇది సరైన పరిష్కారం సూచిస్తుంది. ఎంతోమందికి సాయం చేస్తుందని ప్రామిస్ చేస్తున్నాను' అని చెబుతున్న హేమేష్ 12వ తరగతి చదువుతున్నాడు. తన తదుపరి ప్రాజెక్ట్స్‌తో ఎలక్ట్రానిక్స్, రోబోటిక్ రంగంలో మరిన్ని అడుగులు వేస్తున్నట్టుగా వివరించాడు.

2021లో ప్రధానమంత్రి చేతుల మీదుగా రాష్ట్రీయ బాల పురస్కారాన్ని అందుకున్నాడు. పేరున్న కంపెనీల నుంచి గ్రాంట్‌లను పొందాడు.


– నిర్మలారెడ్డి

మణిపూర్ ఒక మంచి వార్తను వినిపించింది.
ఆ రాష్ట్రానికి చెందిన మహిళా దర్శకురాలు మీనా లాంగ్‌జామ్ తీసిన
'ఆంద్రో డ్రీమ్స్' ముంబైలో జరుగుతున్న చలన చిత్రోత్సవంలో
బెస్ట్ డాక్యుమెంటరీగా ఎంపికైంది.
మణిపూర్‌లోని మారుమూల గ్రామం 'ఆంద్రో'లో ఆడపిల్లల
ఫుట్‌బాల్ క్లబ్‌ను 30 ఏళ్లుగా పరిస్థితులకు ఎదురీది నడుపుతున్న
'లైబి' అనే మహిళ పోరాటాన్ని ఈ డాక్యుమెంటరీ రికార్డు చేసింది.
ఆడపిల్లల క్రీడా స్వేచ్ఛను ఎన్ని అడ్డంకులొచ్చినా
కొనసాగనివ్వాలనే సందేశం ఇచ్చే ఈ డాక్యుమెంటరీ
దేశ, విదేశాల్లో ప్రశంసలు పొందుతోంది.

అడ్డంకులను దూరంగా తన్ని...


దర్శకురాలు: మీరా లాంగ్‌జామ్

న్యూస్‌మేకర్


ఆంద్రో డ్రీమ్స్ పోస్టర్

అంతా చేసి ఎనిమిది వేల మంది జనాభా మించని ఊరు ఆంద్రో. మణిపూర్ తూర్పు ఇంఫాల్ జిల్లాలో మారుమూల ఉంటుంది అది. అక్కడి ఆడపిల్లలు ఫుట్‌బాల్ ఆడితే ఏంటి... ఆడకపోతే ఏంటి? కాని 60 ఏళ్ల లైబి మాత్రం– ఆడాల్సిందే అంటోంది. ఆమె గత ముప్పై ఏళ్లుగా 'ఆంద్రో మహిళా మండల్ అసోసియేషన్– ఫుట్‌బాల్ క్లబ్' (అమ్మ– ఎఫ్‌సీ) నడుపుతోంది. ఈ క్లబ్‌కు నిధులు లేవు. బిల్డింగ్ లేదు. ఊళ్లో ప్రోత్సాహం లేదూ, ఏమీ లేదు. కాని లైబి మాత్రం అంతా తానై క్లబ్‌ను నడుపుతోంది. ఈ మధ్యే ఆమె ఒక పూరి పాక నిర్మించి దానినే క్లబ్ బిల్డింగ్‌గా ప్రారంభించుకుంది.

'అమ్మాయిలు కేవలం వంటకు, ఇంటి పనికి అంకితమై పోకూడదు. చదువుకోవాలి. ఆడాలి. ధైర్యంగా భవిష్యత్తును నిర్మించుకోవాలి. మా ప్రాంతంలో పురుషులదే సర్వాధికారం. ఇంటి పెద్ద, తెగ పెద్ద ఎంత చెప్తే అంత. వారి దృష్టిలో ఆడవాళ్ల గురించి చింతించాల్సింది ఏమీ ఉండదు. అమ్మాయిలు ఆడతామన్నా ఒప్పుకోరు. నా పోరాటం వల్లే ఇవాళ మా ఊరి నుంచి జాతీయ స్థాయిలో అమ్మాయిలు ఫుట్‌బాల్ ఆడుతున్నారు' అంటుంది లైబి.



తన ఫుట్‌బాల్ క్లబ్ పూరి పాక ముందు లైబి

ఈమె పోరాటం ప్రపంచానికి చెప్పదగ్గది అనిపించింది మణిపూర్‌కే చెందిన మహిళా దర్శకురాలు మీనా లాంగ్‌జామ్‌కు. అలా తయారైన డాక్యుమెంటరీనే 'ఆంద్రో డ్రీమ్స్'.

ఇద్దరి కథ

ప్రస్తుతం ముంబైలో 'జాగరణ్ ఫిల్మ్ ఫెస్టివల్' అట్టహాసంగా జరుగుతోంది. ఇందులో 'ఆంద్రో డ్రీమ్స్' బెస్ట్ డాక్యుమెంటరీగా నిలిచింది. ఇప్పటికే కేరళ, కొరియన్ ఫిల్మ్ ఫెస్టివల్స్‌కు ఎంపికైన ఈ డాక్యుమెంటరీ ముంబైలో విమర్శకుల్ని విశేషంగా ఆకట్టుకుంది. 'దీనికి కారణం ఆంద్రోలో అమ్మ క్లబ్‌ను నడుపుతున్న లైబి పోరాటాన్ని, ఆ క్లబ్‌లో గొప్ప ఫుట్‌బాల్ ప్లేయర్‌గా ఉంటూ మంచి భవిష్యత్తు నిర్మించుకోవాలనుకునే నిర్మల అనే అమ్మాయి ఆకాంక్షలని నేను చూపించడమే. ఒక రకంగా చాదస్త వ్యవస్థతో రెండు తరాల స్త్రీల పోరాటం ఈ డాక్యుమెంటరీ' అని తెలిపింది మీనా లాంగ్‌జామ్.

మణిపూర్ వెలుతురు

నిజానికి మే 3వ తేదీ నుంచి మణిపూర్ వేరే కారణాల రీత్యా వార్తల్లో ఉంది. కాని మణిపూర్‌ను అభిమానించేవారికి ఇప్పుడు ఈ డాక్యుమెంటరీ సాధిస్తున్న విజయాలు సంతోషాన్ని ఇస్తున్నాయి. 'నా డాక్యుమెంటరీ విజయం మా ప్రాంతంలో గతాన్ని మర్చిపోయి కొత్త జీవితం మొదలుపెట్టే ఉత్సాహాన్ని ఇస్తే అంతే చాలు' అంది మీనా లాంగ్‌జామ్. మణిపూర్ యూనివర్సిటీలో కల్చరల్ స్టడీస్‌లో ప్రొఫెసర్‌గా ఉన్న మీనా పాఠాలు చెప్పడంతో పాటు డాక్యుమెంటరీలు కూడా తీస్తుంది. 2015లో ఆమె మణిపూర్‌లో ఫస్ట్ మహిళా ఆటోడ్రైవర్‌గా ఉన్న లైబీ ఓయినమ్ మీద డాక్యుమెంటరీ తీస్తే దానికి చాలా పేరొచ్చింది. ఆ తర్వాత 'అచౌబీ ఇన్ లవ్' పేరుతో పోలో ఆటకు అనువైన స్థానిక జాతి అశ్వాలపై డాక్యుమెంటరీ తీస్తే దానికీ పేరొచ్చింది. ఇప్పుడు 'ఆంద్రో డ్రీమ్స్' మణిపూర్ ఘనతను చాటుతోంది.

బాలికలు, యువతులు క్రీడల్లో ఎంతో రాణిస్తున్నా ఇంకా గ్రామీణ ప్రాంతాల్లో ఆంక్షలు ఉండనే ఉంటాయి. అలాంటి ప్రతి చోట అమ్మాయిలను ప్రోత్సహించే లైబి లాంటి యోధురాళ్లు, వారి గెలుపు గాథలను లోకానికి తెలిపే మీనా లాంటి వాళ్లు ఉండాలని కోరుకుందాం.

యూత్ పల్స్

'ఇప్పటి వరకు ఇన్‌ఫ్లుయెన్సర్ పవర్ ఏమిటో చూశారు. ఇక డీఇన్‌ఫ్లుయెన్సర్ పవర్ ఏమిటో చూసే టైమ్ వచ్చింది'... ఇది తెలుగు సినిమాలో మాస్ డైలాగ్ కాదు. సోషల్ మీడియాలో ఒక కుర్రాడు పెట్టిన కామెంట్.

సోషల్ మీడియాలో ఇన్‌ఫ్లుయెన్సర్‌ల హవా నడుస్తున్న కాలం ఇది. కస్టమర్‌లు ఏది కొనాలో, ఏ షో చూడాలో, ఎలాంటి ఆరోగ్య సూత్రాలు పాటించాలో చెబుతున్నారు. ఇప్పుడు ఈ ట్రెండ్‌కు అడ్డుపడే 'డీఇన్‌ఫ్లుయెన్సింగ్' ట్రెండ్ యువతరం నుంచే వచ్చి బలపడుతోంది. ట్రెడిషనల్ ఇన్‌ఫ్లుయెన్సర్‌లు ఒక ప్రాడక్ట్‌ను హైప్ చేస్తే డీఇన్‌ఫ్లుయెన్సర్‌లు ఆ హైప్‌ను ఛాలెంజ్ చేస్తున్నారు....

ఢీ అంటే ఢీ
ఆర్ట్ ఆఫ్ డీఇన్‌ఫ్లుయెన్సింగ్





సమస్య ఇన్‌ఫ్లుయెన్సర్‌లు కాదు. కొందరు ఇన్‌ఫ్లుయెన్సర్‌లు అనుసరిస్తున్న ధోరణి. వారిలో మార్పు రావాలి. సామాజిక బాధ్యత పెరగాలి. యువతలో అశాంతి, ఆందోళన రేకెత్తించే కంటెంట్‌కు దూరంగా ఉండాలి.
– హిమాద్రి పటేల్, డిజిటల్ క్రియేటర్

మార్కెటింగ్ డాటా అండ్ ఎనలిటిక్స్ కంపెనీ కంతార్ స్టడీ రిపోర్ట్ ప్రకారం వినియోగదారులపై ఇన్‌ఫ్లుయెన్సర్‌ల సిఫారసుల ప్రభావం తక్కువేమీ కాదు. సోషల్ మీడియాలో ఎటు చూసినా ఇన్‌ఫ్లుయెన్సర్‌లు కనిపిస్తారు. టీ పొడుల నుంచి టీపాయ్‌ల వరకు రకరకాల ప్రాడక్ట్స్‌ను ప్రమోట్ చేయడానికి చిన్నచిన్న క్యాచీ వీడియోలను రూపొందిస్తారు. దీనికి భిన్నంగా ఒక ప్రాడక్ట్‌ను విశ్లేషిస్తూ విమర్శిస్తే...అదే డీఇన్‌ఫ్లుయెన్సింగ్!

'డీఇన్‌ఫ్లుయెన్సింగ్' హ్యాష్‌ట్యాగ్‌తో టిక్ టాక్‌లో ఈ ట్రెండ్ మొదలైంది.

సోషల్ మీడియా ఎనాలటిక్స్ ఫర్మ్ ట్యూబ్‌లర్ ల్యాబ్స్ చెబుతున్నదాని ప్రకారం గత సంవత్సరం నుంచి ఈ ట్రెండ్ ఊపందుకుంది. మ్యాడి వెల్ అనే ఇన్‌ఫ్లుయెన్సర్ ప్రముఖ కాస్మటిక్ స్టోర్స్‌లో పని చేసింది. కొన్ని ప్రాడక్ట్స్ పట్ల కస్టమర్‌లు ఎందుకు విముఖంగా ఉన్నారో తన స్వీయ అనుభవాలను తెలియజేసింది. ఈ ప్రభావంతో ఆమె పేరు ఇన్‌ఫ్లుయెన్సర్‌ల జాబితా నుంచి డీఇన్‌ఫ్లుయెన్సర్‌ల జాబితాలోకి చేరింది.

న్యూయార్క్‌కు చెందిన ఇరవై సంవత్సరాల క్లారా కొన్ని బ్రాండ్‌లను విమర్శిస్తూ వీడియోలు చేసింది. వాటిలో ఒకటి వైరల్‌గా మారింది. అదే సమయంలో తాను విమర్శించిన బ్రాండ్ నుంచి ఎలాంటి స్పందన వస్తుందో అనే భయం పట్టుకుంది. అయితే తనకు తానుగా ధైర్యం తెచ్చుకోవడానికి ఎంతో సమయం పట్టలేదు.

'నేను సరియైన వివరాలతోనే వీడియో చేశాను. నేనెందుకు భయపడాలి' అంటోంది క్లారా.

మన సెలబ్రిటీ ఒకరు ఆరోగ్య సంబంధమైన విషయాలపై కాస్త లోతుగానే మాట్లాడాడు. అయితే ఆయన అవగాహన లోపాన్ని ఒక వైద్యుడు వెంటనే ఎత్తిచూపాడు. పాపులర్ చైనీస్ వ్లోగర్ ఒకరు తన వయసు తక్కువగా కనిపించేలా సాంకేతిక మాయ చేస్తే ఎవరో కుర్రాడు కనిపెట్టి 'ఆయన అసలు రూపం ఇది' అని చూపాడు.

స్వీడన్ ఇన్‌ఫ్లుయెన్సర్ ఫేక్ ట్రిప్ గురించి మరొక యువకుడు 'ఇవి ఫొటోషాప్ చిత్రాలు' అని నిజాన్ని బహిర్గతం చేశాడు. నిజానికి ఇలాంటివి సోషల్ మీడియాలో గతంలో లేవని కాదు. అయితే 'డీఇన్‌ఫ్లుయెన్సింగ్' పుణ్యమా అని 'అది కాదు ఇది' అని వెంటనే సాధికార సమాచారంతో స్పందించే ధోరణి పెరిగింది.

డీఇన్‌ఫ్లుయెన్సర్‌లు వోవర్–హైప్‌డ్ ప్రాడక్ట్స్‌ను విమర్శించడమే కాదు చౌక ధరల్లో లభించే వాటి గురించి చెబుతున్నారు.

యూనివర్శిటీ ఆఫ్ పెన్సిల్వేనియాలోని వార్టన్ స్కూల్ ఆఫ్ బిజినెస్‌లో ప్రొఫెసర్ అయిన అమెరికస్ రీడ్ ఇలా అంటున్నారు... 'ఇన్‌ఫ్లుయెన్సర్‌లలో ఎక్కువ మంది సాధికారికంగా మాట్లాడడం లేదేమో అనే భావన కస్టమర్‌లలో వచ్చింది. డబ్బులు ఇస్తారు కాబట్టి సంబంధిత ప్రాడక్ట్‌ను ప్రమోట్ చేస్తారు. నిజానిజాల గురించి వారికి అవసరం లేదు. ఈ నేపథ్యంలో కాస్తో కూస్తో డీఇన్‌ఫ్లుయెన్సర్‌రే నయం అనుకుంటున్నారు. నిజానికి డీఇన్‌ఫ్లుయెన్సర్ కూడా ఇన్‌ఫ్లుయెన్సర్‌రే'

కొందరు ఒక అడుగు ముందుకు వేసి ఈ ట్రెండ్‌కు 'యాంటీ క్యాపిటలిస్ట్' ట్రెండ్‌గా నామకరణం చేశారు.

డీఇన్‌ఫ్లుయెన్సింగ్ ట్రెండ్ వల్ల వృథా ఖర్చులు తగ్గుతాయని, వేలం వెర్రికి అడ్డుకట్టపడుతుందని, పర్యావరణ కోణంలో కూడా ఈ ట్రెండ్ వల్ల మేలు జరుగుతుందని యువతరంలో ఎంతోమంది బలంగా వాదిస్తున్నారు. తమ అభిప్రాయాలను సామాజిక మాధ్యమాలలో ఇతరులతో పంచుకుంటున్నారు. అయితే 'డీఇన్‌ఫ్లుయెన్సింగ్' ట్రెండ్‌పై ప్రశంసలతో పాటు విమర్శలు కూడా ఉన్నాయి.

డీఇన్‌ఫ్లుయెన్సింగ్‌కు విషయ సాధికారత, నిజాయితీ అనేవి కీలకం. అయితే 'డీఇన్‌ఫ్లుయెన్సింగ్' రూపంలో సూడో–అథెంటిసిటీ ముందుకు వస్తుందని, ఈ ట్రెండ్‌ను తమ స్వార్థానికి ఉపయోగించుకునే వారి సంఖ్య పెరుగుతుందనే విమర్శ ఉంది.

'ఈ ట్రెండ్ కాస్త చివరికి ఎలా మారుతుందంటే ఇది కొనవద్దు. మీరు కొనాల్సింది అది అన్నట్లుగా!' అంటుంది 26 సంవత్సరాల అమెరికన్ ఇన్‌ఫ్లుయెన్సర్ జెస్సిక.

'ముఖ్యమైన విషయం ఏమిటంటే ఇన్‌ఫ్లుయెన్సర్‌లు చెప్పగానే కస్టమర్‌ల అభిప్రాయాలు రాత్రికి రాత్రి మారిపోవు. ఇన్‌ఫ్లుయెన్సర్‌లు కేవలం సలహా ఇస్తారు. అంతే. ఏది కొనాలి, ఏది కొనకూడదు అనే స్వీయవిచక్షణ కస్టమర్‌లలో ఉంది. ఇన్‌ఫ్లుయెన్సర్‌లుగా మేము పారదర్శకంగా, నిజాయితీగా ఉంటాం' అంటుంది ఫ్రాన్స్‌కు చెందిన ఇన్‌ఫ్లుయెన్సర్ కోలిన్. ఆమెకు ఇన్‌స్టాగ్రామ్‌లో 4,00,000 ఫాలోవర్స్ ఉన్నారు.

ప్రస్తుతం డీఇన్‌ఫ్లుయెన్సింగ్ ట్రెండ్ హెల్త్, ఫైనాన్స్, లైఫ్‌స్టైల్ విభాగాలలో ఎక్కువగా కనిపిస్తుంది.

'డీఇన్‌ఫ్లుయెన్సింగ్ అనేది వాపా బలుపా?' అనేది పక్కన పెడితే ఈ ట్రెండ్ మూలంగా ఇన్‌ఫ్లుయెన్సర్‌లు ప్రాఫిట్‌కు మాత్రమే కాదు మెరిట్‌కు కూడా ప్రాధాన్యత ఇచ్చే ధోరణి, జవాబుదారీతనం పెరుగుతుంది.

● ఆటో అన్సారీ

లైఫ్ గేర్ మార్చింది


నజ్మా అన్సారీ

ఓ యువకుడు యాచకుడి వేషంలో, కేజీల మొత్తంలో కరెన్సీ నాణేలను తీసుకుని ఐఫోన్ కొనడానికి వెళ్లిన వార్త ఇటీవల సోషల్ మీడియాలో తెగ వైరల్ అయింది. మంచి వయసు, ఓపిక ఉన్న వారే ఇలా చేస్తుంటే... ఓపిక లేకపోయినా సమాజంలో గౌరవంగా బతికేందుకు బురఖా వేసుకుని ఆటో నడుపుతోంది నజ్మా అన్సారీ. అయినా ఇతరుల ముందు చేయి చాచే కంటే.. కష్టపడడమే గౌరవం అనుకుంది. 'గేర్లు మార్చేయండి చాలు గౌరంగా బతకవచ్చు' అని చెబుతూ ఎంతో మందికి ప్రేరణగా నిలుస్తోంది.



నజ్మా అన్సారీ వయసు 45. ఉత్తరప్రదేశ్, మొరాదాబాద్ నగరంలోని కట్‌ఘర్‌లో ఆమె నివసిస్తోంది. ఆమెకు ఇద్దరు పిల్లలు. 2010లో భర్త మరణించడంతో ఇంటి భారం ఆమె మీద పడింది. అప్పటిదాక గృహిణిగా ఉన్న నజ్మాకు తన కొడుకు, కూతుర్ని ఎలా పెంచాలో అర్థం కాలేదు. భర్త నడిపిన టీషాపును అద్దె కట్టలేక వదిలేసింది. ఇంట్లోనే టీ తయారు చేసి విక్రయించింది. అలా పిల్లల అవసరాలు చూసుకుంటూ ఉండగానే భర్త ఇన్సురెన్స్ డబ్బులు రూ.4.35 లక్షలు వచ్చాయి. మూడు లక్షల రూపాయలతో 2015లో కూతురికి పెళ్లి చేసింది.

ఆదాయం సరిపోక..

టీ స్టాల్ నడుపుతూ కుటుంబాన్ని లాక్కొస్తున్న నజ్మాకు డబ్బులు సరిపోయేవి కావు. కూతురి పెళ్లి తరువాత ఆర్థిక ఇబ్బందులు పెరిగాయి. దీంతో భర్త ఇన్సురెన్స్ డబ్బుల్లో మిగిలిన మొత్తంతో ఎలక్ట్రిక్ ఆటో కొనుక్కుంది. ఇంటి పనులన్నీ పూర్తిచేసి ఆటో తోలుతూ సంపాదిస్తోంది.

అర్ధరాత్రనే భయం లేదు

నజ్మా మూడు షిఫ్టుల్లో ఆటో నడుపుతోంది. బురఖా ధరించి ఉదయం తొమ్మిదిగంటలకు ఆటో స్టార్ట్ చేస్తుంది. ఎండ వేడికి బురఖాలో ఎక్కువ సమయం ఉండలేక మధ్యాహ్నం ఒంటి గంటకు ఇంటికి వచ్చేస్తుంది. తిరిగి సాయంత్రం ఆరు గంటల నుంచి రాత్రి ఎనిమిది వరకు ఆటో నడుపుతోంది. మళ్లీ రాత్రి తొమ్మిది నుంచి రెండుగంటల వరకు విరామం లేకుండా నడుపుతుంది. ఇలా మూడు షిఫ్టుల్లో మొత్తం మీద రోజుకి ఐదు నుంచి ఆరు వందల వరకు సంపాదిస్తోంది. స్థానిక ట్రాఫిక్ పోలీసులు నజ్మా ధైర్యాన్ని మెచ్చుకుని ప్రోత్సహిస్తున్నారు. అయితే నజ్మాను చూసిన ఓ హిందూ మహిళ కూడా ఆటో నడపడం మొదలు పెట్టింది. దీంతో ఆ మహిళ ఆర్థిక పరిస్థితులు కూడా మెరుగు పడ్డాయి. ఇలా ఇతరులకు స్ఫూర్తి నిలుస్తూనే, తన కష్టార్జితంతో హజ్ యాత్రకు వెళ్తానని చెబుతోంది నజ్మ.

అడుక్కునే కంటే...

''పేదరికం ఉందని అక్కడా ఇక్కడా చేయి చాచకుండా కష్టపడి ఏ పనైనా చేసి గౌరవంగా బతకవచ్చు. ఆటో గేర్లు మారుస్తూ, ప్రయాణికులను గమ్యాలకు చేరుస్తున్నాను. ఇక మహిళా డ్రైవర్‌గా నాకు రాత్రి సమయాల్లో కూడా ఎటువంటి ఇబ్బంది ఎదురు కాలేదు. ముఖ్యమంత్రి యోగి ప్రభుత్వం వచ్చాక అర్ధరాత్రి బయటకు రావడానికి కూడా భయం వేయడం లేదు. ప్రభుత్వ అధికార యంత్రాంగం మాకు రక్షణ కల్పిస్తోంది. పరిస్థితులు మరింత దిగజారినప్పుడు అల్లా కాపాడతాడు'' అని నజ్మా అన్సారీ ధైర్యంగా చెబుతోంది.

బ్యూటిప్స్





● వేప చెట్టు ఇంటి దగ్గర్లో ఉంటే వేరే సౌందర్యసాధనాలతో పనే ఉండదు. వేపాకులు, బెరడు, వేపనూనె ఔషధాలుగానే కాదు, సౌందర్య సాధనాలుగానూ ఉపయోగపడతాయి. ఎలాంటి చర్మ సమస్యలకైనా వేపతో ఇట్టే చెక్ పెట్టేయవచ్చు. ● ముఖంపై మొటిమలు, నల్లమచ్చలు ఏర్పడుతుంటే వేపాకులతో చక్కని విరుగుడు ఉంది. గుప్పెడు వేపాకులను అరలీటరు నీటిలో వేయాలి. వేపాకులు పూర్తిగా మెత్తగా మారిపోయేంత వరకు ఆ నీటిని మరిగించాలి. కాసేపటికి నీరు ఆకుపచ్చ రంగులోకి మారుతుంది. అప్పుడు వడగట్టి ఆ కషాయాన్ని సీసాలో భద్రపరచుకోవాలి. ప్రతిరోజూ రాత్రి పడుకునే ముందు ఆ నీటితో కాస్త దూదిని తడిపి ముఖాన్ని రుద్దుకుంటే చాలు. మొటిమలు, మచ్చలు మటుమాయం అవుతాయి. ● చర్మం పొడిబారి, తరచు దురదలు పెడుతున్నట్లయితే, పైన చెప్పుకున్నట్లే వేపాకులతో కషాయం చేసి, బకెట్ నీటిలో ఒకకప్పు కషాయాన్ని పోసి ఆ నీటిని స్నానానికి ఉపయోగిస్తే చాలు. కొద్దిరోజుల్లోనే చర్మం ఆరోగ్యకరంగా మారుతుంది. ● ముఖం తరచు జిడ్డుగా మారుతుంటే, వేపాకుల పొడి, గంధంపొడి, గులాబి రేకుల పొడి సమభాగాలుగా తీసుకుని కలుపుకోవాలి. చెంచాడు పొడిలో మూడు నాలుగు చుక్కల వేపనూనె, కొద్దిగా తేనె, నిమ్మరసం పిండుకుని ముద్దలా కలుపుకోవాలి. దానిని ముఖానికి పట్టించి, అరగంటసేపు ఆరనివ్వాలి. పూర్తిగా ఆరిన తర్వాత గోరువెచ్చని నీటితో కడిగేయాలి. ఇలా చేస్తే ముఖం తాజాగా మారుతుంది.